సాక్షి అనకాపల్లి

సోమవారం, 29, జూలై, 2024



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

విశాఖ: వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామంలో ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది.



పుస్తకావిష్కరణ

విశాఖ: డాక్టర్ విజయలక్ష్మి రచించిన 'చిన్నోడికి ప్రేమతో' పుస్తకాన్ని ద్రవిడ వర్సిటీ పూర్వ వీసీ కేఎస్ చలం ఆదివారం ఆవిష్కరించారు.



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

విశాఖ: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు.

ఊసేలేని ఉపాధి వేతనాలు

ఉపాధి వేతనదారుల రెక్కల కష్టంతో ప్రభుత్వం పరిహాసమాడుతోంది. మండుటెండలో చెమటోడ్చి పని చేసిన పాపానికి నయా పైసా చెల్లించలేదు. రెండున్నర నెలలుగా కోట్లాది రూపాయల వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో వారి వ్యథ అరణ్య రోదనే అవుతోంది. నిత్యం ఆర్థిక ఇబ్బందులను పంటి బిగున భరిస్తూ వస్తున్నారు.

- రెండున్నర నెలలుగా ఎదురు చూపులే
- కూలి డబ్బులు అందక కూలీల ఆర్థిక ఇబ్బందులు
- జిల్లాలో రూ.12.8 కోట్లకు పైగా బకాయిలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



బుచ్చెయ్యపేట మండలం రాజాంలో ఉపాధి పనులకు వెళ్లి వస్తున్న కూలీలు

యలమంచిలి రూరల్: జిల్లాలో ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలు వేతనాల కోసం రెండున్నర నెలలుగా ఎదురు చూడాల్సి వస్తోంది. దీంతో పనులు చేసినా పస్తులు ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని కూలీలు ఆవేదన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.12.88 కోట్ల మేర వేతన బకాయిలు కూలీలకు రావాల్సి ఉంది. వలసల నివారణకు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి ఉపాధి కల్పించాలన్న సదుద్దేశంతో ఉన్న గ్రామంలోనే పని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 2005లో అమల్లోకి తెచ్చింది. ఇది పేదలకు వరమే అయినా పనులు చేసి 10 వారాలు గడుస్తున్నా వేతనాలు అందకపోవడంతో కూలీలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఉపాధి పనులు చేసే కూలీలకు ఏ వారంలో ఎంత పని చేసుంటే, దానికి సంబంధించిన మొత్తం వేతనం వారి ఖాతాల్లో నేరుగా జమ అయ్యేవి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు విడుదలయ్యేవి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పీఎఫ్ఎంఎస్ ద్వారా కూలీలకు నేరుగా చెల్లింపులు చేస్తోంది. మే 21 నుంచి ఈ రోజు వరకు కూలీలకు చెల్లించాల్సిన సొమ్ము మొత్తం పెండింగ్‌లో ఉంది.

ఎన్నికల వరకు సకాలంలో వేతనాలు..

ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయం వరకు కూలీల వేతనాలు మూడు, నాలుగు రోజుల్లోనే వారి ఖాతాల్లో జమవుతుండడంతో గత రెండు నెలల్లో ఉపాధి పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపారు. దీంతో కొంతమేర పని చేసిన కూలీల సంఖ్య కూడా పెరిగింది. అయితే రెండున్నర నెలలుగా వేతనాల చెల్లింపులు పూర్తిగా నిలిచిపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వారంతా వాపోతున్నారు. జిల్లాలో కూలీలకు సంబంధించి కొన్ని ప్రాంతాల్లో బ్యాంకుల ద్వారా, ఎక్కువగా పోస్టాఫీస్‌ల ద్వారా వేతనాలు అందజేస్తున్నారు. దీంతో తమ డబ్బులు ఖాతాల్లో జమయ్యాయో లేదోనని ఆందోళనతో నిత్యం వాటి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మరికొన్ని చోట్ల కూలీలు డబ్బుల కోసం క్షేత్ర సహాయకుల ఇళ్లతోపాటు మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. వీరికి వెంటనే బకాయిలు చెల్లించాలని సీఐటీయూ, ఇతర ప్రజాసంఘాల నాయకులు తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు.



బకాయిల కోసం ఎదురుచూస్తున్న ఉపాధి కూలీలు

రూ.12.88 కోట్ల వేతన బకాయిలు

జిల్లాలో 645 గ్రామ పంచాయతీల్లో 2.78 లక్షల జాబ్ కార్డులుండగా, 4.37 లక్షల మంది కూలీలు సభ్యత్వం కలిగి ఉన్నారు. ఉపాధి హామీ పథకంలోని చట్టం ప్రకారం కూలీలు పనిచేసిన 21 రోజుల్లోనే వేతనాలు అందించాలి. కానీ 10 వారాలైనా చేసిన పనులకు సంబంధించిన వేతనాలు అందడం లేదు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.12.88 కోట్లకు పైగా కూలీల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

చెమటోడ్చి పనిచేసినా ఇంకా ఇవ్వలేదు



ఇంట్లో ఖాళీగా ఉండలేక ప్రభుత్వం కల్పించిన ఉపాధి హామీ పనులకు వెళ్లాను. మండుటెండల్లో రోజుకు నాలుగైదు గంటలు పనులు చేశాం. చెమటోడ్చి పని చేసినా.. సమయానికి డబ్బులు చెల్లించడం లేదు. అధికారులు చొరవ తీసుకుని కూలి సొమ్ము విడుదల చేయించి మమ్మల్ని ఆదుకోవాలి. ఉపాధి పనులతో జీవనోపాధి దొరుకుతుందనే ఆశతో పనులు చేశాం. ఇన్ని రోజులు బకాయి పెడితే మాకు ఆర్థిక ఇబ్బందులు రావా?

– పందల వరలక్ష్మి, గోకివాడ, రాంబిల్లి మండలం

వేతనాలు చెల్లించకపోతే ఆందోళన



చేసిన పనికి వేతనాలు చెల్లించకపోతే ఎలా? 10 వారాల పాటు చెల్లించకుండా ఉంటే కూలీల కుటుంబాలు ఎలా బతకాలి. ఇప్పుడు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సమస్యను పరిష్కరించాలి. లేకపోతే ఆందోళనలు చేపడతాం.

– కాళ్ల నర్సింహమూర్తి, పురుషోత్తపురం, యలమంచిలి మండలం

త్వరలో వేతనాలు చెల్లిస్తాం



జిల్లాలో ఉపాధి పనులు చేసిన కూలీలందరికీ వారం రోజుల్లో వేతనాల చెల్లింపులు చేస్తాం. ఇప్పటికే చెల్లించాల్సిన వేతనాలకు సంబంధించిన బడ్జెట్ ఆమోదం పొందింది. త్వరలో బకాయి ఉన్న వేతనాల మొత్తం కూలీల ఖాతాల్లో జమవుతాయి. ఈ విషయంలో ఆందోళన చెందనవసరం లేదు. వేతనాలు అందలేదని ఎవరూ పనులు మానొద్దు

– ఇ. సందీప్, డ్వామా పీడీ

న్యూస్‌రీల్

ఆలయ భూముల వద్ద ఎండోమెంట్ సిబ్బంది కాపలా



రాణిగారి తోట వద్ద కాపలా ఉన్న దేవదాయశాఖ ఉద్యోగులు

అనకాపల్లి: శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం (విశాఖ అంబికాబాగ్) భూముల వద్ద దేవదాయశాఖ ఉద్యోగులు ఆదివారం ప్రైవేట్ వ్యక్తులెవరూ రాకుండా విధులు నిర్వహించారు. శనివారం కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు జేసీబీ సహాయంతో దేవదాయశాఖ భూమిని చదును చేస్తుంటే ఆ శాఖ ఏఈవో వి.రాంబాబు అడ్డుకున్నారు. బయటి వ్యక్తులు రాకుండా సిబ్బంది కాపలా కాస్తున్నారు.

పెద్దేరు సాగునీరు విడుదల



పెద్దేరు జలాశయం నుంచి నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల: పెద్దేరు జలాశయం నుంచి ప్రధాన పంట కాలువలకు ఆదివారం సాగునీరు విడుదల చేశారు. నీరు విడుదల చేసిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో జలాశయంలో నీరు పుష్కలంగా చేరిందని, ఆయకట్టు భూములకు ఢోకా ఉండదన్నారు. జలాశయం ప్రధాన గేట్ల వద్ద ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పీవీజీ కుమార్, ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, జలాశయం అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న నేవీ వైస్ అడ్మిరల్ జనరల్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న కె.స్వామినాథన్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం నేవీ వైస్ అడ్మిరల్ జనరల్ న్యూఢిల్లీ కె.స్వామినాథన్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరపూజ నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమార్చన నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.

రేపు నగరానికి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

మహారాణిపేట (విశాఖ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం మంగళవారం విశాఖ నగరానికి రానున్నారని మంగళగిరిలోని కమిషన్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. ఉదయం 11 గంటలకు కేజీహెచ్ ఎథిక్స్ గ్యాలరీలో అనధికార దత్తతలు, చట్ట ప్రకార చర్యలపై గైనకాలజీ, చిన్న పిల్లల వార్డుల వైద్యులు, నర్సింగ్, సెక్యూరిటీ, పారా మెడికల్ సిబ్బందితో జరిగే అవగాహన కార్యక్రమంలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా కాలేజీ సెమినార్ హాల్లో జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఇంటర్మీడియట్ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లతో మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రభుత్వ అధికారుల సమన్వయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. తరువాత నగరంలోని పలు ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలను తనిఖీ చేసే అవకాశం ఉంది. అనంతరం రోడ్డు మార్గాన కమిటీ సభ్యులు మంగళగిరికి వెళ్లనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు జీవీఎంసీలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

డాబాగార్డెన్స్ (విశాఖ): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

గాయపడ్డ వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు భరోసా

రూ.50 వేల సాయం అందజేసిన మాజీ ఎమ్మెల్యే గణేష్



అప్పలనాయుడుకు చెక్కు అందజేస్తున్న గణేష్

మాకవరపాలెం: టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. గత నెల 9వ తేదీ రాత్రి మండలంలోని రాచపల్లి శివారు యరకన్నపాలెంలో ఇదే గ్రామానికి చెందిన కొల్లి అప్పలనాయుడుపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి గాయపరిచారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి బాధితుడు అప్పలనాయుడుకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేల సాయం మంజూరు చేశారు. ఈ మొత్తం ఆయనకు ఆదివారం రాచపల్లిలో నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అందజేశారు. నర్సీపట్నం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, మండల సీనియర్ నేత రుత్తల యర్రాపాత్రుడు, ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పెట్ల భద్రాచలం, దొరబాబు, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు



తాటిచెట్లపాలెం (విశాఖ): భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణం కారణంగా కేకే లైన్ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు రోజు ఉదయం విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 29 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు రోజు కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు రోజు రాత్రి విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం–కిరండూల్(18514) ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది.

తిరుగు ప్రయాణంలో ఈ నెల 29 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు రోజు కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్– విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

శాకంబరీ దేవిగా నూకాంబిక



అనకాపల్లి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో అమ్మవారు ఆదివారం భక్తులకు శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం నాలుగో ఆదివారం పురస్కరించుకుని ప్రముఖ వ్యాపారవేత్త మళ్ల జగ్గప్పారావు సహకారంతో 100 కేజీల వివిధ రకాలైన కూరగాయలతో, 700 రకాల పండ్లతో అమ్మవారిని ఆలయ ఉద్యోగులు అలంకరించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. కొంతమంది భక్తులు శనివారం రాత్రి అమ్మవారిపాటను నిర్వహించి అమ్మవారి ఘటాలను తలపై పెట్టుకుని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. కుటుంబ సమేతంగా వంటకాలు చేసుకుని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ నేతృత్వంలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ముగ్గురు యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్

విశాఖ: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో కొట్టుకుపోతుండగా లైఫ్‌గార్డ్స్ ముగ్గురు యువకుల ప్రాణాలు కాపాడారు. నగరంలోని ఓ కళాశాలలో చదువుతున్న వి.ఈశ్వరరావు, రామ్మోహన్, భరత్ ఆదివారం స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. అలల ఉధృతి ఎక్కువగా ఉండటం వల్ల వారు కొట్టుకుని పోతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ గమనించి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. వీరిలో ఇద్దరు సురక్షితంగా బయటపడినప్పటికీ... ఈశ్వరరావు పరిస్థితి విషమంగా ఉంది.

సాహితీ విశ్వరూపం రావిశాస్త్రి

- రచయిత వృద్ధుల కల్యాణ రామారావు
- ఘనంగా రాచకొండ విశ్వనాథ శాస్త్రి జయంతి



రావిశాస్త్రి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కథా రచయితలు, సాహితీవేత్తలు

సీతంపేట (విశాఖ): రాచకొండ విశ్వనాథశాస్త్రి సాహితీ విశ్వరూపమని రచయిత, న్యాయవాది వృద్ధుల కల్యాణ రామారావు అన్నారు. ఉదయిని సాహితీ సంస్థ ఆధ్వర్యంలో రాచకొండ విశ్వనాథ శాస్త్రి 102వ జయంతి సభ ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని ఎలా అర్థం చేసుకోవాలో రావిశాస్త్రి సాహిత్యం వల్లనే తెలిసిందన్నారు. రావిశాస్త్రి పరిచయంతో వాస్తవ సమాజం చూశానని, ఆయన రచనలు చదువుతూ ఉంటే ఆత్మీయత కనిపిస్తుందన్నారు. రావిశాస్త్రి రచనల్లో తనకు నచ్చిన జరీ అంచు, విలువలు, మాయ కథలు ఆయనకు కూడా బాగా ఇష్టమని పేర్కొన్నారు. రావిశాస్త్రి రచనల్లో చాలా వరకు కోర్టు వాతావరణంతో ముడిపడి ఉంటాయని, క్రిమినల్, పోలీస్, లాయర్, మెజిస్ట్రేట్ అయితే బాగా అర్థమవుతాయన్నారు. కథారచయిత వాడ్రేవు చిన వీరభద్రుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర మాండలికానికి శాస్త్రి తన రచనలతో విశ్వవ్యాప్త గుర్తింపు తెచ్చారని కొనియాడారు. రావిశాస్త్రి కుమారుడు ఉమాకుమార శాస్త్రి మాట్లాడుతూ తాను న్యాయవాదిని అయ్యాకే తండ్రి రచనల విలువ తెలిసిందన్నారు. రచనల్లో చెప్పినట్టే ఆయన తన జీవితాన్ని నిరాడంబరంగా గడిపారని గుర్తు చేశారు. ప్రముఖ విమర్శకులు వర్మ మాట్లాడుతూ సమాజంలో పాతుకుపోయిన భావజాలంలోని లోపాలను రావిశాస్త్రి తన రచనల ద్వారా ఎత్తిచూపారని తెలిపారు. సభాధ్యక్షులు కుమార్ కూనపరాజు మాట్లాడుతూ శాస్త్రి రచనలు 60–70 ఏళ్ల మధ్య రాసినవి అయినప్పటికీ నేటి ఆధునిక యుగంలో సాహిత్యానికి దగ్గరగా ఉంటాయన్నారు. ప్రజాకవి దేవిశ్రీ రావిశాస్త్రిపై పాడిన పాట అందరినీ ఆకట్టుకుంది. అనంతరం రావిశాస్త్రి సాహితీ పురస్కారాలను యువ రచయితలు సురేంద్ర శీలం, శ్రీఊహ, మల్లిపురం జగదీష్‌లకు అందజేసి సత్కరించారు. సాహితీవేత్తలు, రచయితలు కె.మల్లీశ్వరి, వై.వేణుగోపాల్ రెడ్డి, తాడి ప్రకాష్, జి.ఎస్.చలం పాల్గొన్నారు.

'స్థాయి' కోసం కూటమిలో కుమ్ములాట!

- స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో సభ్యుల కేటాయింపుపై తెగని చర్చలు
- చెరో రెండు కేటాయించాలంటున్న బీజేపీ, జనసేన
- చెరొకటి మాత్రమేనంటున్న టీడీపీ
- ఎమ్మెల్యేల చెంతకు చేరిన పంచాయితీ
- రేపటితో నామినేషన్ల స్వీకరణకు తుది గడువు
- మరోసారి విజయం సాధిస్తామంటున్న వైఎస్సార్‌సీపీ



సాక్షి, విశాఖపట్నం: మహా విశాఖ నగరపాలక సంస్థ స్థాయీ సంఘం ఎన్నికలు కూటమిలో కొత్త పంచాయితీని తెచ్చి పెట్టాయి. ఇటీవల కొందరు కార్పొరేటర్లు టీడీపీ, జనసేన వైపు మొగ్గు చూపడంతో తమకు బలం పెరిగిందని భావిస్తూ.. స్టాండింగ్ కమిటీలో పాగా వేసేందుకు ఎత్తుగడలు ప్రారంభించాయి. అయితే సభ్యుల కేటాయింపుపై మూడు పార్టీల మధ్య కుమ్ములాట మొదలైంది. జనసేన, బీజేపీ తమకు చెరో రెండు కేటాయించాలని డిమాండ్ చేస్తుంటే.. టీడీపీ మాత్రం అంగీకరించడం లేదు. నామినేషన్ల స్వీకరణకు మంగళవారం తుది గడువు కావడంతో.. ఈ పంచాయితీ నగర ఎమ్మెల్యేల వద్దకు చేరింది. మరోవైపు కొందరు కార్పొరేటర్లు వెళ్లిపోయినా స్టాండింగ్ కమిటీ మాత్రం తమకే సొంతమని వైఎస్సార్‌సీపీ ధీమా వ్యక్తం చేస్తోంది.

నేడు తుది జాబితా ప్రకటన!

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఈ నెల 22న నోటిఫికేషన్ జారీ చేయగా ఈనెల 30వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరించనున్నారు. 31న స్క్రూటినీ నిర్వహించి తుది జాబితా ప్రకటిస్తారు. ఆగస్టు 7న ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్లు వేసేందుకు ఆఖరి గడువు సమీపించడంతో కూటమిలో కుయుక్తులు మొదలయ్యాయి. సింహభాగం తమ వద్దే ఉంచుకొని జనసేన, బీజేపీకి చెరొకటి కేటాయించాలని టీడీపీ భావిస్తోంది. అయితే.. రెండు పార్టీలు చెరో రెండు తమ కార్పొరేటర్లకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తుండటంతో అంతర్గత కుమ్ములాట జరుగుతోంది. ఇప్పటికే టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు జాబితాను టీడీపీ ఎమ్మెల్యేలకు అప్పగించారు. జనసేన, బీజేపీ సైతం.. తమ జాబితాను ఆయా పార్టీల ఎమ్మెల్యేలకు అందించాయి. సీట్ల కేటాయింపుపై మూడు పార్టీల ఎమ్మెల్యేలు సోమవారం సమావేశమై తుది జాబితా ప్రకటించనున్నట్లు సమాచారం. జనసేన కార్పొరేటర్లు మాత్రం పట్టు వీడకూడదని భావిస్తుండగా తక్కువ బలం ఉన్న బీజేపీ మాత్రం.. సర్దుకుపోవాలని నిర్ణయించినట్లు సమాచారం.

ధీమాగా వైఎస్సార్‌సీపీ...

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో మరోసారి విజయ దుందుభి మోగిస్తామని వైఎస్సార్ సీపీ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే పార్టీ తరఫున 12 మందితో కూడిన జాబితాను మేయర్ గొలగాని హరివెంకట కుమారి, పార్టీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు అధిష్టానానికి అందించారు. వీరిలో ఎంపిక చేసిన 10 మంది జాబితాను సోమవారం విడుదల చేసి నామినేషన్లు వేయించేందుకు సిద్ధమవుతున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎన్నికల్లో పది మంది సభ్యులను కార్పొరేటర్లు ఎన్నుకోనున్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి కొందరు కార్పొరేటర్లు వెళ్లిపోయినా తమకు ఎలాంటి నష్టం లేదని ఆ పార్టీ ధీమాతో ఉంది. మరోసారి స్టాండింగ్ కమిటీ మొత్తాన్ని సొంతం చేసుకునేందుకు మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్లు కటుమూరి సతీష్, జియ్యాని శ్రీధర్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పాల్గొన్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

రోలుగుంట: చోడవరం డిగ్రీ కళాశాలలో ఆదివారం 2003 నుంచి 2006 వరకూ చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. ఇక్కడ ఆటా పాటలతో రోజంతా గడిపారు. అప్పటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. వీరి ఆహ్వానం మేరకు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరారాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేను పూర్వపు విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ విధమైన కార్యక్రమాలు నిర్వహించుకోవడం మన జీవితాల్లో తీపి గుర్తులుగా మిగిలిపోతాయన్నారు.

హేళన తట్టుకోలేక యువతి ఆత్మహత్య

మునగపాక: పుట్టినప్పటి నుంచి గూని ఉండడంతో సమాజంలో తిరిగేటపుడు హేళన చేయడాన్ని తట్టుకోలేక ఒంపోలు పేటకు చెందిన నక్కా మాధురి(19) గడ్డిమందు తాగి మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ఒంపోలు పేటకు చెందిన నక్కా సత్యనారాయణ కుమార్తె మాధురి చిన్నప్పటి నుంచి గూనితో జీవనం సాగిస్తుంది. ప్రజల మధ్య తిరిగేటపుడు తనను హేళన చేస్తున్నారని దీనిని తట్టుకోలేక శనివారం రాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు మాధురిని అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు.

అర్ధరాత్రి బీచ్ రోడ్డులో సీపీ పర్యటన

విశాఖ సిటీ (విశాఖ): బీచ్ రోడ్డులో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు చేపట్టినా ఉపేక్షించేది లేదని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. శనివారం అర్ధరాత్రి ఆయన బీచ్ రోడ్డులో కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి వరకు పర్యటించి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. బీచ్ రోడ్డులో పలు ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులపై సీపీ ఇచ్చిన 7995095799 నెంబర్‌కు ఫిర్యాదులు రావడంతో స్వయంగా పోలీసింగ్ చేస్తూ తనిఖీ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్, రేసింగ్, ర్యాష్ డ్రైవింగ్, బహిరంగ మద్యపానం, అల్లరి మూకల చర్యలను గమనించారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, పోలీసులు పట్టించుకోకపోయినా, లంచం అడిగినా ఎటువంటి సమస్యలు ఉన్నా తన నెంబర్‌కు తెలియజేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంటాయని తెలిపారు.

పెద్దపులి గాండ్రింపు

రూపంలో రాజసం.. నడకలో గాంభీర్యం.. వేగం.. ఇలా ఎన్నో లక్షణాలతో పులి మన జాతీయ జంతువైంది. ఒకప్పుడు వందల్లో కనిపించే పులుల సంఖ్య తర్వాత క్రమంగా తగ్గిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన చర్యలతో కొన్నేళ్లుగా ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. పెద్ద సంఖ్యలో పులుల సంతతి పెరుగుతుండడం ఆసక్తి రేకెత్తిస్తోంది. పులులు ఉన్న అడవుల్లో వృక్ష సంపద, పచ్చదనం, వివిధ రకాల వన్యప్రాణులతో వాతావరణం సమతుల్యంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం. ఇందిరాగాంధీ జూ పార్కులో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

- రాష్ట్రంలో పెరుగుతున్న పులుల సంతతి
- మన జూ పార్కులో ఏడు టైగర్లు
- నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం



జూలో ఎన్‌క్లోజర్లో తిరుగుతున్న ఎల్లో టైగర్స్

ఆరిలోవ (విశాఖ): అరణ్యంలో వన్యప్రాణులు సమపాళ్లలో ఉంటే మానవాళి మనుగడకు మేలు జరుగుతుంది. పర్యావరణంలో ఉన్న ఏ వన్యప్రాణి జాతి తగ్గినా సమతుల్యతకు భంగం కలుగుతుంది. మానవ చర్యలతో పులుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో పర్యావరణ శాస్త్రవేత్తల్లో ఆందోళన నెలకొంది. దీంతో పులుల సంతతి పెరగేందుకు, వాటి అవసరంపై ప్రపంచ వ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి పర్యావరణవేత్తలు 1972లో దృష్టి సారించారు. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా పులుల వేటను నిషేధించారు. 2010 నుంచి ఏటా జూలై 29న అంతర్జాతీయ పులులు దినోత్సవం నిర్వహిస్తున్నారు.

పెరుగుతున్న పెద్ద పులుల సంఖ్య

భారతదేశంలో పెద్ద పులుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ప్రస్తుతం దేశంలో వివిధ రాష్ట్రాల అడవుల్లో 3,682 పెద్ద పులులు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు లెక్కకట్టారు. 2006లో దేశంలోని వివిధ రాష్ట్రాల అడవుల్లో 1,411 పెద్ద పులులు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. 2010లో 1,726, 2014లో 2,226, 2018లో 2,969 కాగా 2023(2022లో లెక్కింపు జరగలేదు)లో వాటి సంఖ్య 3,682కి పెరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, మధ్యప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని అడవుల్లో పులులు ఎక్కువగా సంచరిస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

రాష్ట్రంలో 75 పెద్ద పులులు

మన రాష్ట్రంలో 75 పులులు ఉన్నాయి. నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్‌లో 64, శేషాచలం అడవుల్లో 9, పాపికొండ లులో రెండు పులులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. శ్రీశైలం, ఆత్మకూరు, మర్కాపూర్‌లలో పులుల సంరక్షణ కేంద్రాలున్నాయి. 2014లో వీటి సంఖ్య 40 కాగా.. 2023 లెక్కల ప్రకారం వీటి సంఖ్య75కు పెరిగింది.

పులులను ఎలా లెక్కిస్తారంటే..

నేషనల్ టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీ(ఎన్‌టీసీఏ) ఆధ్వర్యంలో ప్రతి నాలుగేళ్లకోసారి అటవీశాఖ అధికారులు పులుల సంఖ్యను లెక్కిస్తారు. అరణ్యాల్లో అవి నడిచే జాడ కనుక్కొంటారు. అధికార బృందాలు వాటి అడుగులను బట్టి లెక్కిస్తారు. అలాగే అడవుల్లో అవి సంచరించే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తారు. వాటిలో నమోదైన వాటిని గుర్తిస్తారు.

ఏకాంతంగా పులుల సంచారం

అడవుల్లో పులులు ఒంటిరిగానే సంచరిస్తాయి. జింకలు, కనుజులు, ఏనుగులు మాదిరిగా గుంపులుగా తిరగవు. గుంపులుగా తిరిగే జింకల జాడ కనిపెట్టి ఓ చెట్టు చాటున, లేదంటే దట్టమైన పొదల చాటున మాటు వేస్తాయి. జింకలు దగ్గరకు రాగానే ఒక్కసారిగా వాటిపై దూకి ఒక దాన్ని పట్టుకుని ఆహారంగా తీసుకుంటాయి. ఇవి అడవుల్లో 12 నుంచి 16 ఏళ్లు జీవిస్తాయి. వీటిలో 3 నుంచి 4 ఏళ్ల వయసులో సంతానోత్పత్తి దశ ప్రారంభమవుతుంది. బ్రీడింగ్ సమయంలో మాత్రమే ఆడ, మగ పులులు కలసి తిరుగుతాయి. ఆడ పులి గర్భం దాల్చిన అనంతరం మగ పులి వేరే చోటకు వెళ్లిపోతుంది. అప్పటి నుంచి ఆడ పులి ఒంటరిగా ఉంటూ 110 రోజుల గర్భావధి అనంతరం కూనలకు జన్మనిస్తుంది. ఒక తడవలో ఒకటి నుంచి 5 వరకు కంటుంది. కూనలు జన్మించిన తర్వాత రెండేళ్లు తల్లి సంరక్షణలోనే ఉంటాయి. ఈ రెండేళ్లలో ఆ కూనలు ఆహారం సంపాదన నేర్చుకుంటాయి. అనంతరం తల్లే వాటిని తరిమేస్తుంది. అప్పటి నుంచి అవి వేర్వేరుగా జీవిస్తాయి.

దొరికినంత వరకు వెంబడిస్తాయి

పులులు జింక, కనుజు, అడవిదున్న, అడవి పంది, ముళ్లపంది తదితర వాటిని తింటాయి. అవి వాటి పంజాకు దొరికినంత వరకు వెంబడిస్తాయి. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో పరుగెత్తి వాటిని పట్టుకుంటాయి. పులి ఒక జంతువును చంపిన అనంతరం రెండు, మూడు రోజుల పాటు అదే ప్రాంతంలో తిరుగుతూ దాన్ని తింటుంది. తర్వాత వారం రోజుల వరకు ఆహారం లేకుండా ఉండగలదు. నీరు మాత్రం ఎక్కువగా తాగుతుంది. ఆహారం కోసం మగవి 20 నుంచి 25 కిమీ పరిధిలో, ఆడ పులులు 15 నుంచి 20 కిమీ పరిధిలో అడవుల్లో తిరుగుతుంటాయి. ఒక పులి తిరిగే పరిధిలో మరో పులి సంచరించదు. పులి తల నుంచి తోక వరకు సుమారు 10 అడుగుల పొడవు ఉంటుంది. దీని ఎత్తు 3 నుంచి మూడున్నర అడుగులు. ఆడ పులి 65 కిలోల నుంచి 170 కిలోలు, మగది 90 కిలోల నుంచి 310 కిలోల బరువు ఉంటుంది. ఆహారం కోసం వేటాడటం వల్ల వాటి ఆరోగ్యం క్రమేపీ క్షీణిస్తుందని అధికారులు చెబుతున్నారు.

ఇందిరాగాంధీ జూపార్కులో 7 పెద్ద పులులు

ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో 7 పెద్ద పులులున్నాయి. వీటిలో నాలుగు తెల్ల పులులు(రెండు జతలు) కాగా మరో మూడు ఎల్లో టైగర్స్(ఒకటి మగ, రెండు ఆడవి). ఇవి ఆయా ఎన్‌క్లోజర్లలో సందర్శకులను అలరిస్తున్నాయి. ఇక్కడ జంతు సంరక్షకులు వీటికి సమయానికి ఆహారం, నీరు అందిస్తున్నారు. ఎన్‌క్లోజర్లలో వాటిని ఒక్కొక్కటిగా విడిచిపెడతారు. అన్నింటినీ ఒకేసారి విడిచిపెడితే పోట్లాడుకుని గాయాలు చేసుకుంటాయి.

పులులే అడవులకు రక్ష



పులులపై అందరూ అవగాహన కలిగి ఉండాలి. పులులు ఉన్న అడవుల్లో వృక్ష సంపద పుష్కలంగా ఉంటుంది. జింకలు, కనుజులు, అడవి పందులు ఎక్కడైతే గుంపులుగా తిరుగుతున్నాయో.. ఆయా ప్రాంతాల్లో పులులు ఉన్నట్లు భావిస్తాం. ఇవి అడవుల్లో 15 ఏళ్ల వరకు, జూ పార్కులో అయితే 25 ఏళ్లకు పైగా జీవిస్తాయి. ప్రతీ పూట ఆహారం, వైద్యం అందిస్తున్నాం. అందుకు ఎక్కువ కాలం జీవించడానికి ఇక్కడ అవకాశం ఉంటుంది. ప్రతీ నాలుగేళ్లకు చేపడుతున్న లెక్కల ప్రకారం పులులు సంఖ్య పెరుగుతోంది. పులులపై అవగాహన కల్పించడానికి ఆదివారం పాఠశాల నుంచి పీజీ వరకు విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించాం. సోమవారం జూలో పులులు దినోత్సవం నిర్వహిస్తాం.

– డాక్టర్ నందినీ సలారియా, జూ క్యూరేటర్

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు

ఆరిలోవ (విశాఖ): అంతర్జాతీయ పులుల దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం జూ పార్కులో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు నగరంలో పలు పాఠశాలలు, కళాశాలల నుంచి 110 మంది ఒకటో తరగతి నుంచి పీజీ విద్యార్థులు హాజరయ్యారు. తరగతులు వారీగా పులులు, వాటి సంరక్షణ, పర్యావరణంలో వాటి అవసరం తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. వీటిలో ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి సోమవారం బహుమతులు అందజేస్తామని జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు.



చిత్రాలు వేస్తున్న చిన్నారులు



ఆకర్షణీయంగా చిన్నారి వేసిన చిత్రం

రూ. 1150 కోట్ల విలువైన భూములపై ప్రజాప్రతినిధుల కన్ను

- దేవదాయ భూముల కబ్జాకు యత్నం
- కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- సీపీఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్

అనకాపల్లి: దేవదాయ ధర్మదాయశాఖకు చెందిన భూములను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే ఆక్రమిస్తుంటే సమాన్య ప్రజల భూములకు దిక్కెవరని సీపీఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ అన్నారు. స్థానిక దొడ్డిరామునాయుడు భవనంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక పూల్‌బాగ్‌రోడ్డు రహదారిలో రాణీగారి పూలతోట సర్వే నంబర్ 66 లోని 29.71 ఎకరాల శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం (అంబికా బాగ్) భూములు సుమారు రూ.1150 కోట్లు విలువైన దేవదాయ శాఖల ఆధీనంలో ఉన్న భూములను ఈనెల 27న కొంతమంది ఆక్రమించడాన్ని అడ్డుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై సోమవారం కలెక్టర్‌కు ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడమే కాకుండా ధర్నాలు చేయడం జరుగుతుందని, స్థానిక ప్రజలు దేవదాయశాఖ భూములను కాపాడేందుకు సహకరించాలని ఆయన కోరారు. ఈ భూములు పరిరక్షణకు చుట్టూ కంచె వేసి సెక్యూరిటీని కూడా దేవదాయ శాఖ వారు ఏర్పాటు చేయగా, దానిని పట్టపగలు కొంతమంది ప్రైవేటు వ్యక్తులు వచ్చి ఎండోమెంట్ బోర్డులను, కంచెను తొలగించి చదును చేయడాన్ని ఆయన ఖండించారు. వందల కోట్లు ఖర్చుపెట్టి ఎన్నికల్లో గెలిచి వేల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను కబ్జా చేయడం నేటి రాజకీయ నాయకులకు అలవాటైందని మండిపడ్డారు. కబ్జా జరుగుతున్నా కనీసంగా ప్రభుత్వం కానీ, దేవదాయ శాఖ అధికారులు కానీ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూ కబ్జాలపై, అసెంబ్లీలో పెద్ద ఎత్తున శ్వేత పత్రాలు విడుదల చేసి ఆక్రమణలపైన, భూ కబ్జాలపైన చర్చ జరుగుతున్న సమయంలో, అసెంబ్లీ సమావేశాలు ముగిసిన మరుక్షణమే కోట్లాది రూపాయలు విలువైన భూములపై అధికార పార్టీ అండదండలతో ఈ ఆక్రమణకు పాల్పడుతున్నారని అన్నారు. ఎండోమెంట్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులైన ఎంపీ ఎమ్మెల్యేలు వెంటనే జోక్యం చేసుకొని ప్రభుత్వ భూములు దేవుడు భూములను సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, కాళ్ళ తేలయ్యబాబు, డీడీ వరలక్ష్మి, ఆర్ శంకరరావు, వి.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

అన్నం పెట్టే అమ్మ..అర్ధంతరంగా..

- బైకుపై నుంచి జారిపడి మహిళ మృతి
- పేద కుటుంబంలో తీరని వేదన



మృతురాలు రత్నం(ఫైల్)

కోటవురట్ల: పేదరికం వెంటాడుతుంటే కూలి కష్టంతో కుటుంబాన్ని పోషిస్తున్న ఓ మహిళ ప్రమాదంలో మృతి చెందింది. అపరిచితుడి బైకు ఎక్కి ప్రమాదవశాత్తూ జారిపడి తిరిగిరాని లోకాలకు పోయింది. ఇద్దరు పిల్లలు తల్లిలేని బిడ్డలయ్యారు. అమాయకపు భర్త అయోమయంగా చూస్తుంటే అందరి హృదయాలను కలిచివేసింది. కొడవటిపూడి గ్రామానికి చెందిన తేటకాల రత్నం(36) ఆదివారం ఉదయం గ్రామ శివారున ఉన్న జీడిపిక్కల ఫ్యాక్టరీకి వెళ్లి మృత్యువాత పడింది. గ్రామంలోని స్టేట్ బ్యాంకు వద్ద నుంచి గుర్తు తెలియని వ్యక్తి బైకు ఎక్కిన రత్నం ఫ్యాక్టరీ వద్ద రోడ్డుపై విగతజీవిగా కనిపించింది. గ్రామస్తుల కథనం మేరకు రత్నం భర్త అప్పారావు అమాయకుడు కావడంతో రత్నమే జీడిపిక్కల ఫ్యాక్టరీలో పనిచేసి కుటుంబాన్ని పోషించేది. జీడిపిక్కల ఫ్యాక్టరీ కొద్ది రోజుల క్రితం మూతపడడంతో పనిచేసిన కాలానికి పింఛను ఎంత వస్తుందో తెలుసుకునేందుకు ఇంటి నుంచి బయలుదేరి వెళ్లింది. కె.వెంకటాపురం వైపుగా వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తి బైకు ఎక్కగా ఫ్యాక్టరీ దాటుతుండగా ఫ్యాక్టరీ దాటేస్తున్నామన్న కంగారులో బైకుపై నుంచి కిందికి దూకి ఉంటుందని అనుమానిస్తున్నారు. లేదంటే బైకు సడన్ బ్రేక్ వేయడంతో రోడ్డుపై జారిపడిన రత్నం తలకు బలమైన గాయం కావడంతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. భయపడిన బైకువాలా అక్కడి నుంచి పరారైనట్టుగా ఊహిస్తున్నారు. రోడ్డుపై పడిఉన్న రత్నాన్ని చూసిన స్థానిక రైతులు వెంటనే ఆమె వద్దకు వెళ్లి చూడగా ప్రాణాలు కోల్పోయినట్టుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి కుటుంబసభ్యులతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు.

ఆ ప్రాంతం కుటుంబసభ్యుల రోధనతో బరువెక్కింది. భర్త అప్పారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటవురట్ల సీహెచ్‌సీకి తరలించారు. సర్పంచ్ కోసూరు అప్పారావు, ఎంపీటీసీ యలమంచిలి ప్రకాష్ బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉండగా పేదరికంగా కారణంగా కుమార్తె పదోతరగతి వరకు చదివి మానేసింది. కుమారుడు 8వ తరగతి చదువుతున్నాడు. తల్లి మరణంతో పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

ప్రభుత్వ ఐటీఐలో సీట్ల సంఖ్య పెంచాలి

కంచరపాలెం (విశాఖ): కంచరపాలెం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రం(ఐటీఐ)లో, ప్రభుత్వ ఐటీఐల్లో సీట్ల సంఖ్య పెంచాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. సమాఖ్య జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సీట్ల సంఖ్య పెంచాలని, విద్యార్థుల నిష్పత్తికి తగినట్లు సీట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆడిషన్స్ పూర్తిస్థాయిలో ముగిసినప్పటికీ ఆదివారం ఉదయం 8గంటలకు రావాలంటూ మెసేజ్‌లు రావడంతో విద్యార్థులు కళాశాలకు చేరుకున్నారని, తీరా వచ్చిన తరువాత యాజమాన్యం స్పందించకపోవడంతో వారంతా సమాఖ్యకు ఫిర్యాదు చేశారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో మాట్లాడి విద్యార్థులకు ఇబ్బంది రాకుండా జిల్లాలో ఇతర ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సీట్లు వచ్చే విధంగా చొరవ తీసుకోవాలని కోరామన్నారు.

జిల్లా పీఏసీఎస్ ఉద్యోగుల నూతన కార్యవర్గం

తుమ్మపాల: జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ నూతన పాలకవర్గం అధ్యక్షుడిగా ఎంకే వల్లాపురం పీఏసీఎస్ కార్యదర్శి బొడ్డేడ లక్ష్మణరావు ఎన్నికైనట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన నాగులపల్లి పీఏసీఎస్ కార్యదర్శి మల్ల స్వామి తెలిపారు. స్థానిక సీఐటీయు కార్యాలయంలో ఆదివారం జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సిబ్బంది, యూనియన్ మహాజన సభ సమావేశంలో ఎన్నికలు నిర్వహించారు. పాలకవర్గంలో సబ్బవరం పీఏసీఎస్ కార్యదర్శి గుంప రమణ, కసింకోట పీఏసీఎస్ స్టాఫ్ అసిస్టెంట్ ఎల్లపు లక్ష్మణరావు కోశాధికారిగా, విజయరామరాజుపేట పీఏసీఎస్ కార్యదర్శి జగన్ కన్వీనర్‌గాను, జిల్లా యూనియన్ అసోసియేటెడ్ అధ్యక్షుడిగా దిమిలి పీఏసీఎస్ కార్యదర్శి ఎం.లోవరాజు గౌరవ అధ్యక్షునిగా పాయకరావుపేట పీఏసీఎస్ కార్యదర్శి పినపాత్రుని నాగభూషణం ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. సహకార సంఘాల సిబ్బందికి జీవో ఎంఎస్‌- 36 ప్రకారం జీతాలు నిర్ణయించి ఎరియర్ జీతాలు ఇవ్వాలని సిబ్బంది తీసుకున్న జీతాలను అనామత్తుత్తులను రద్దు చేయాలని, గత 15 సంవత్సరాల నుంచి పే రివిజన్ జరగకపోవడం వల్ల సిబ్బందికి అన్యాయం జరిగిందని, నూతన స్కేలు అమలు పరచాలని సమావేశంలో తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో గత యూనియన్ ట్రెజరర్ తుమ్మపాల పీఏసీఎస్ కార్యదర్శి ఒ.ఎన్ ఈశ్వరరావు, జిల్లా యూనియన్ కార్యవర్గ సభ్యుడు, ఉమ్మడి విశాఖ జిల్లా పాడేరు జిల్లా కార్యవర్గ సభ్యుడు, రాష్ట్ర యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కలిగట్ల వెంకటరావు, 300 మంది సహకార సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ నూతన పాలకవర్గం

రీవైండింగ్ షాపులో చోరీ

రూ.2.50 లక్షల విలువైన సామగ్రి అపహరణ



చోరీలో వంగిపోయిన షాపు షట్టర్

మాకవరపాలెం: మోటార్ రివైండింగ్ షాపులో చోరీ జరిగింది. మండలంలోని జంగాలపల్లికి చెందిన పోతు రమణ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో కొన్నేళ్లుగా రీవైండింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షాపునకు ఉన్న షట్టర్‌ను పెకిలించి చోరీకి పాల్పడ్డారు. ఉదయం షాపు దగ్గరకు వచ్చేసరికి చోరీ జరిగినట్టు గుర్తించిన రమణ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. షాపులో ఉన్న నాలుగు వ్యవసాయ మోటర్లు, సుమారు 160 కేజీల పాత రాగి వైరుతోపాటు మరో 30 కేజీల వరకు కొత్త రాగి వైరు చోరీకి గురయ్యాయి. వీటి విలువ రూ.2 లక్షల 50 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. రమణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు క్లూస్ టీంను రంగంలోకి దింపి వివరాలు సేకరించడంతోపాటు విచారణ చేట్టారు. ఇదిలా ఉండగా ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఉన్నా పనిచేయలేని సరిస్థితి ఉందని, సీసీ కెమేరాల ఏర్పాటులో పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యం దుకాణాల్లో కాలం చెల్లిన బీర్ల విక్రయం

ఆ బీరు తాగిన వ్యక్తికి అస్వస్థత

పెదగంట్యాడ (విశాఖ): ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కాలం చెల్లిన బీర్లు విక్రయిస్తుండడం కలకలం రేపుతోంది. ఆ బీరు తాగిని వ్యక్తి అస్వస్థతకు గురి కావడంతో ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమయ్యారు. వివరాలివి. ఈ నెల 16న జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని సిద్దేశ్వరంలో గల ప్రభుత్వ మద్యం దుకాణంలో అదే ప్రాంతానికి చెందిన నూకరాజు అనే వ్యక్తి ఈ నెల 16న బీరు కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లి తాగాడు. కాసేపటి తర్వాత వాంతులు చేసుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అతను తాగిన బీరు సీసాను పరిశీలించారు. అది కాలం చెల్లినది కావడంతో వారంతా మద్యం దుకాణం వద్దకు వచ్చి ఆందోళన చేశారు. మద్యం దుకాణం సిబ్బంది ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించగా, వారు వచ్చి నూకరాజును ఆస్పత్రికి తరలించారు. కాలం చెల్లిన బీర్లను గుర్తించి వాటిని సమీపంలోని కాలువలో ఒంపేశారు.

కాలేయ వ్యాధులపై జాగ్రత్త

కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: కాలేయ వ్యాధి పట్ల ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని.. ఆరోగ్యకరమైన జీవన శైలి ద్వారా ఈ వ్యాధిని అదుపులో ఉంచవచ్చని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. ప్రపంచ హెపటైటిస్ డే సందర్భంగా ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం వద్ద ఆంధ్రా మెడికల్ కళాశాల, కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, మైక్రోబయాలజీ విభాగాల ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ, వైద్య శిబిరం జరిగింది. కాళీమాత ఆలయం నుంచి పోలీసు అమర వీరుల స్థూపం వరకు సాగిన ర్యాలీలో పలు వైద్య విభాగాధిపతులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెపటైటిస్ బి, సి వంటి కాలేయ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. క్రమంగా హెపటైటిస్ బి, సి వ్యాధుల ప్రమాదం పెరుగుతోందని, దీనిని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుందని హెచ్చరించారు. పిల్లలు పుట్టిన 24 గంటల్లోపు లలో హెపటైటిస్ బీ వ్యాక్సిన్ తప్పకుండా వేయించాలని సూచించారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ హెపటైటిస్ బి, సి వ్యాధులకు గురైన వారికి ప్రత్యేకంగా కేజీహెచ్‌లో ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.అనంతరం కలెక్టర్ ఉచిత కాలేయ పరీక్షల వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ సీనియర్ వైద్యుడు పెద వీర్రాజు, కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎల్ఆర్ఎస్ గిరినాథ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్, ఏఎంసీ విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, కేజీహెచ్ మేనేజర్ జె.ఎం.జవహర్, పలువురు వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న వైద్యులు, వైద్య విద్యార్థులు

క్లుప్తంగా

ఘనంగా మోదకొండమ్మ ఉత్సవం



మోదకొండమ్మ వారిని దర్శించుకుంటున్న వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి

కశింకోట: స్థానిక శారదానది అవతల పొలాల్లో వెలసి ఉన్న మోదకొండమ్మ వారి ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. చీరలు,రవికెలు, అరటి గెలలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వైభవంగా జాతర ఊరేగింపు నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తుమ్మపాల: కాలుష్యం లేని వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని, తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పిల్లా హరశ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక గవరపాలెం మున్సిపల్ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటం ద్వారా భవిష్యత్ తరాలకు మేలు చేయగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాకేష్, కోశాధికారి సత్యనారాయణ, వినోద్ కుమార్, విశ్రాంత అటవీ రేంజర్ రమణ పాల్గొన్నారు.

రెండు రోజులుగా నిలిచిన నీటి సరఫరా

కశింకోట: మండల కేంద్రం కశింకోటలో రెండు రోజులుగా ఇంటింటి కుళాయిల ద్వారా నీరు సరఫరా కావడం లేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వీధి కుళాయిల నీటితో సరిపెట్టుకుంటున్నారు. ఆ నీరు గృహ అవసరాలకు సరిపడకపోవడంతో అవస్థలకు గురవు తున్నారు. ఇక్కడి సమీపంలోని సంపతిపురం వద్ద ఉన్న భారీ మంచి నీటి పథకం నుంచి పైపు లైన్ ద్వారా కశింకోటతోపాటు మండల గ్రామాలకు నీరు సరఫరా అవుతోంది.అయితే మండలంలోని బయ్యవరం వద్ద పైపులైన్ లీక్ కావడంతో శనివారం నుంచి సరఫరాను నిలి పి వేశారు. దీనికి మరమ్మతులు పూర్తి చేసిన తర్వాత ఇంటింటి కుళాయిలకు నీటిని సరఫరా పునరుద్ధరించనున్నట్టు సిబ్బంది తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

డెడ్‌పూల్ వుల్వరీన్	:	రాజా
కల్కి 2898ఏడీ	:	సత్యనారాయణ స్క్రీన్-1
డెడ్‌పూల్ వుల్వరీన్ 3డీ తెలుగు	:	సత్యనారాయణ స్క్రీన్-2
రాయన్	:	పర్తిసాయి
డార్లింగ్	:	షిర్డిసాయి
పురుషోత్తముడు	:	వెంకటేశ్వర
రామ్ ఎన్ఆర్ఐ	:	శ్రీసత్య
ఆపరేషన్ రావన్	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 60 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-10 యూనిట్లు, బి పాజిటివ్-21 యూనిట్లు, ఒ పాజిటివ్-27 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 211 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 169 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

‘భౌ’బోయ్

- గ్రామాల్లో కుక్కల స్వైర విహారం
- కనిపించిన వారిపై దాడి చేస్తున్న గ్రామ సింహాలు
- వీధుల్లోకి వచ్చేందుకు భయపడుతున్న పిల్లలు, మహిళలు



కన్నూరుపాలెంలో కుక్కల స్వైర విహారం

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కనిపించిన వారిపై దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. వాటికి కాటుకు గురై బాధితులు ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. పశువులపై కూడా దాడి చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కుక్కలను నియంత్రించాలని చాలా కాలంగా కోరుతున్నా పంచాయతీల అధికారులు పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండలంలోని అతి పెద్ద పంచాయతీ అయిన కశింకోట సహా కన్నూరుపాలెం, బయ్యవరం, తాళ్లపాలెం తదితర గ్రామాల్లో వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. చీకటి పడితే చాలు వీధుల్లోకి వచ్చేందుకు గ్రామస్తులు భయపడుతున్నారు. కశింకోటలోని ప్రధానమైన పంచాయతీ రోడ్డులో సంతబయల, మేదర వీధి, గవరపేట, కస్పావీధి, పూసర్ల వీధి, భవానీ కాలనీ, సత్తెమ్మ కాలనీ హౌసింగ్ కాలనీ, గాడి వీధి, ద్వారపురెడ్డి వీధుల్లో కుక్కల బెడద అధికంగా ఉండడంతో ఆయా ప్రాంతాల వారు బెంబేలెత్తుతున్నారు. రాత్రి పూట ఉద్యోగాలు, ఇతర పనుల మీద వెళ్లి వచ్చే వారిని కుక్కలు వెంట పడికరుస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. కుక్కల బెడదను నివారించాలని ఇటీవల జరిగిన గ్రామ సభలో పలువురు స్థానిక పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను కోరారు. కన్నూరుపాలెంలో కూడా వందకు పైగా కుక్కలు గుంపులుగా సంచరిస్తూ గ్రామస్తులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. కొత్త వారు వస్తే దాడి చేసి గాయపరుస్తున్నాయని స్థానికులు తెలిపారు. గొర్రెలు, మేక పిల్లలు, గేదె, ఆవుల పెయ్యిలను ఎత్తుకుపోయి చంపేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. మిగిలిన పలు గ్రామాల ప్రజలు కూడా కుక్కల బెడదతో నిత్యం సతమతమవుతున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో ఊర కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కుక్కల బెడద నివారించాలి



కశింకోటలో కుక్కల బెడద అధికంగా ఉంది. వీటి బెడద వల్ల వీధుల్లో, సంత బయల ప్రాంతంలో తిరగలేకపోతున్నాం. చీకటి పడితే రోడ్లపైకి గుంపుగుంపులు చేరి, తిరగనివ్వడం లేదు. వీటి దాడికి గురైన పలువురు ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కుక్కల బెడదను నియంత్రించడానికి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

–మహ్మద్ ఖలీల్ అహ్మద్, కశింకోట.

ఆస్పత్రి పాలు కావలసి వస్తోంది



కన్నూరుపాలెం వీధుల్లో వీధి కుక్కలు విచ్చల విడిగా తిరుగుతున్నా వాటి నియంత్రణకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీనివల్ల వాటి కాటుకు గురై ఆస్పత్రుల పాలు కావలసి వస్తోంది. ఆవు, గేదె పెయ్యిలను కూడా ఇవి ఎత్తుకు పోయి చంపేస్తూ నష్టం కలిగిస్తున్నాయి. వీటి బెడద నివారించడానికి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

–అక్కిరపు సింహాచలం నాయుడు, రైతు, కన్నూరుపాలెం, కశింకోట మండలం

వందకు పైగా గ్రామ సింహాలు



కన్నూరుపాలెంలో వందకు పైగా కుక్కలు గుంపులుగా స్వైర విహారం చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీటిని నియంత్రించాలని పంచాయతీ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. దీంతో కుక్కల బెడదతో సతమతమవుతున్నాం.

–రొంగలి అప్పలనాయుడు, కన్నూరుపాలెం

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న ఆడారి రవిబాబు

అనకాపల్లి: రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించడమే కాకుండా ప్రాణదానం చేసిన వారమవుతామని జిల్లా విద్యాశాఖ ఏడీ ఆడారి రవిబాబు అన్నారు. స్థానిక నాయుళ్లవీధి ఉడ్‌పేట సిటీపబ్లిక్ హైస్కూల్ ఆవరణలో జీవీఎంసీ మెయిన్‌రోడ్డు పెద్ద హైస్కూల్‌కు చెందిన 1987–88 పదోతరగతి పూర్వ విద్యార్థుల(మిత్ర అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీస్) ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా ప్రతి ఏడాది ఫ్రెండ్‌షిప్ డేను పురస్కరించుకుని ముందు ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అంతకుముందు 57మంది పూర్వ విద్యార్థులు విశాఖ ఎ.ఎస్.రాజా బ్లడ్ బ్యాంక్‌కు రక్తం దానం చేశారు. ఈ కార్యక్రమంలో మిత్ర అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీస్ సభ్యులు గుండా సాయి,శివకుమార్, జిలాని, ఆడారి నరసయ్య నాయుడు,రామకృష్ణ,భరణి పాల్గొన్నారు.

వైభవంగా సత్తెమ్మ తల్లి ఉత్సవం

కశింకోట: స్థానిక శారదానది అవతల పొలాల్లో వెదురుపర్తి వద్ద వెలసి ఉన్న సత్తెమ్మ తల్లి ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రైతులు, ప్రజలు తరలి వెళ్లి అమ్మ వారికి పూజలు చేశారు. చీరలు, రవికెలు, అరటి గెలలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

ఏఎంఏఎల్ కళాశాలకు నాక్ బి–ప్లస్ ప్లస్ గుర్తింపు

తుమ్మపాల: ఏఎంఏఎల్ కళాశాలకు నాక్ బి–ప్లస్ ప్లస్ గుర్తింపు లభించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు ఒక ప్రకటలో తెలిపారు. నిరుపేద విద్యార్థులకు 71 సంవత్సరాలుగా ఉన్నత విద్యనందిస్తూ అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో పేదల కళాశాలగా పేరొందిన ఏఎంఏఎల్‌కు నాక్ బి–ప్లస్‌ప్లస్ గుర్తింపు రావడం ఆనందదాయకమన్నారు. గుర్తింపు రావడంపై కళాశాల యాజమాన్య ప్రతినిధులు, పూర్వవిద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

మా వయస్సు పదిహేనే..

- 55 ఏళ్ల తరువాత కలసి.. అనుభవాలు కలబోసుకుని
- పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



55 ఏళ్ల తరువాత 70 ఏళ్ల వయస్సులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



అడ్డురోడ్డులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కోటవురట్ల : వాళ్లంత 70 ఏళ్ల యువకులు..మనువలు, మునిమనవళ్లతో ఆటలాడుతూ కృష్ణారామా అంటూ కాలక్షేపం చేసే జస్ట్ 70 ఏళ్ల కుర్రాళ్లు. మోకాళ్లు పట్టేసి వంగలేకపోతున్నా జుట్టుకు రంగేసి హుషారుగా తిరిగే ఆ కుర్రాళ్లంతా 55 ఏళ్లకు కలుసుకుని మురిసిపోయారు. ఒకరినొకరు కుశలం అడుగుతూ ఆత్మీయంగా కబుర్లు చెప్పుకున్నారు. ఆనాటి గురువుల తొడపాశాలు, మొట్టికాయలను గుర్తుకు తెచ్చుకుని నవ్వుకున్నారు. వారి ఆత్మీయ పలకరింపులతో పాఠశాల ఆవరణ సందడిగా మారిపోయింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1969లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు 55 ఏళ్ల తరువాత ఆదివారం కలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఒక్కటైన వారంతా ఒకరినొకరు అపురూపంగా చూసుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. వారి బ్యాచులో 21 మంది దివంగతులయ్యారని తెలుసుకుని బాధపడ్డారు. 1969లో సుమారు 60 మంది పదోతరగతి పూర్తి చేయగా అందులో 21 మంది అనేక కారణాలతో మృతి చెందారు. మిగిలిన వారిలో 32 మంది ఆత్మీయ కలయికలో పాల్గొన్నారు. రాజుపేటకు చెందిన యల్లపు రమణ వారందరి వివరాలు సేకరించి ఓ చోటకు చేర్చడంలో సఫలీకృతులయ్యారు. 70 ఏళ్ల వయస్సులో కూడా 32 మంది తమ కుటుంబ సభ్యులతో హాజరుకావడం చర్చనీయాంశంగా మారింది. ఆత్మీయ పలకరింపుల అనంతరం ఆత్మీయ విందారగించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్.ఎస్. రాంబాబురాజు, ఆర్.ఎస్. సత్యనారాయణరాజు పాల్గొని వారిని అభినందించారు.

కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో...

ఎస్.రాయవరం : కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం అడ్డురోడ్డులో కలుసుకున్నారు. సుమారు 25 ఏళ్ల తరువాత అడ్డురోడ్డులో కలుసుకున్న విద్యార్థులు అలనాటి తీపి జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకుని సందడి చేశారు. అలాగే స్థిరపడిన రంగాలు వివరాలు చెప్పుకుని ఒకరికొకరు సహకారిగా ఉండాలని నిర్ణయించుకున్నారు.

భగవద్గీత శ్లోకాలపై పోటీలు



బహుమతులు పొందిన విద్యార్థులు

మునగపాక: విద్యార్థులు భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలని శ్రీ వేంకటేశ్వర గీత ప్రచార కమిటీ చైర్మన్ శరగడం పరదేశినాయుడు తెలిపారు. మండలంలోని మా ఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు భగవద్గీతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్లోకాల్లో రాణించిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. రామాయణం తదితర గ్రంథాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయ అధ్యక్షులు భీశెట్టి ధనశ్రీను,కార్యదర్శి సంజీవరావు, కిల్లాడ ప్రసాదరావు, మహిళా డైరెక్టర్లు సునీత, ధనలక్ష్మి, తులసి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శాకంబరిగా నూకాంబిక అమ్మవారు



శాకంబరిగా దర్శనమిచ్చిన నూకాంబిక అమ్మవారు

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో నూకాంబిక అమ్మవారిని ఆదివారం శాకంబరి అమ్మవారిగా అలంకరించి భక్తులకు దర్శన మిచ్చారు. ఆషాఢ మాసంలో నూకాంబిక అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. ఈ మేరకు వేకువ జాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దళితవాడల్లో సమస్యల పరిష్కారానికి పోరాటం



జైభీమ్ సేన సేవా సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

తుమ్మపాల: దళితవాడల్లో సమస్యల పరిష్కారానికి పోరాడుతూ, వాటి అభివృద్ధికి జైభీమ్ సేన సేవా సంఘం పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రేబాక మధుబాబు చెప్పారు. పట్టణంలో సీపీఐ సమావేశం హాల్‌లో ఆదివారం జై భీమ్ సేన సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 13 మండలాల కార్యదర్శులు ఎన్నుకున్నామని, మిగతా మండలాల వారిని యథావిధిగా కొనసాగిస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతి మండలంలో సమావేశాలు నిర్వహించి, దళితువాడల అభివృద్ధిపై చర్చిస్తామని చెప్పారు. దళితుల సమస్యలను పరిష్కరించేందుకు పనిచేస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో అంబేడ్కర్ భవనం, గ్రంథాలయం ఏర్పాటు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఎం.లావచందు, వేలా శివ గణేష్, రేబాక ఇంద్ర కుమార్, మాటూరు మహేష్ సీతారాముడు, గుడాల ఆనంద్ కిరణ్, కొండలరావు, శ్రీకాంత్, మహేశ్వరరావు, జై భీమ్ సేన సేవా సంఘం మండలాల సభ్యులు పాల్గొన్నారు

29న విజయవాడలో కేబుల్ ఎక్స్‌పో

తుమ్మపాల: కేబుల్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని ఈనెల 29 నుంచి మూడు రోజుల పాటు విజయవాడలో నిర్వహించనున్నట్టు జిల్లా కేబుల్ ఆపరేటర్ల సంఘం నాయకుడు కె.వి.ఎస్. ప్రకాష్ ఆదివారం తెలిపారు. జిల్లా కేబుల్ టీవీ ఆపరేటర్లు అందరూ పాల్గొని విజయం వంతం చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని భారీ ఎత్తున నిర్వహిస్తున్న కనెక్ట్ ఏపీ –2024 కేబుల్ ఎక్స్‌పో, టెక్నికల్ సెమినార్‌కు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వ్యవస్థకు చెందిన నిష్టాతులు హాజరవుతారన్నారు. జాతీయస్థాయిలో పేరొందిన దేశ, విదేశీ బ్రాండెడ్ కంపెనీలు వందలాది స్టాళ్లు ఏర్పాటు చేసి, తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తాయని తెలిపారు. రానున్న రోజుల్లో ఆపరేటర్లు ఏ విధంగా ముందుకు వెళ్లాలి అనే అంశంపై చర్చించి, దిశా నిర్దేశం చేయనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేబుల్ ఆపరేటర్ల సంఘం నాయకులు దాడి ఈశ్వరరావు, పొలమరశెట్టి ఈశ్వరరావు, నడిపల్లి నాగేశ్వరరావు, భేతి వెంకటరమణ, గెడ్డం భాస్కరరావు, తానాం అప్పారావు, దొడ్డి రాజు పాల్గొన్నారు.

దేవాలయాలకు విరాళాల వెల్లువ



మునగపాక వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దృశ్యం



మూలపేటలోని గంగాలమ్మతల్లి గుడికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : మునగపాక, మూలపేట గ్రామాల్లో నిర్మాణాలు జరుగుతున్న ఆలయాలకు భక్తులు విరాళాలు విరివిగా అందజేస్తున్నారు. మునగపాకలో రూ.4 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణానికి కమిటీ సభ్యులు విరాళాలు సేకరిస్తున్నారు. కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌తో పాటు సభ్యులు ఇంటింటికీ వెళ్లి విరాళాలు తీసుకుంటున్నారు. మునగపాకకు చెందిన చరకం కన్నారావు జ్ఞాపకార్థం కుమారుడు మురళీకృష్ణ రూ.50 వేల నగదును ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో పెద్దలు సూరిశెట్టి రాము, ఆడారి అచ్చియ్యనాయుడు,కోనపల్లి రామ్మోహనరావు, కాండ్రేగుల జగ్గారావు, విల్లూరి మోహన్, వెలగా శ్రీనివాసరావు,ఆడారి కాశీబాబు,వీడీఎం నాయుడు, విల్లూరి నూకనరసింగరావు తదితరులు పాల్గొన్నారు. మూలపేటలోని గంగాలమ్మతల్లి గుడికి కూడా భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. గ్రామానికి చెందిన కాండ్రేగుల ఈశ్వరరావు–రాధ దంపతులు రూ.10,116 విరాళంగా ఆదివారం అందజేశారు. మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, కమిటీ సభ్యులు కాశీరావు, భీశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జగన్నాథస్వామి ఆలయ చైర్మన్‌గా జగ్గారావు



జగన్నాథ స్వామి ఆలయ కమిటీ సభ్యులు

మునగపాక : స్థానిక జగన్నాథ స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా బొడ్డేడ జగ్గారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. వైస్ చైర్మన్‌గా కాండ్రేగుల జగ్గప్పారావు, కోశాధికారిగా పొలమరశెట్టి జగ్గ అప్పలనాయుడు, కోశాధికారిగా విల్లూరి జగన్నాథరావు ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా రామ జగన్నాథం, జగన్నాథరావు, వెంకటప్పారావు, పెంటకోట జగన్నాథరావు, దొడ్డి ప్రసాద్, జగన్నాథరావు, దేవకి, పెంటకోట నాయుడు, బొడ్డేడ జగన్నాథరావు ఎన్నికయ్యారు.

మా మంచి మాస్టారు...

- వృత్తి బోధన... ప్రవృత్తి సేవా నివేదన
- సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆచార్యులు మాస్టారు
- సొంత ఖర్చుతో ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం



బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను దొడ్డిగల్లులో వివరిస్తున్న ఆచార్యులు



గత ఏడాది సీఎం జగన్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తీసుకుంటున్న ఆచార్యులు

నక్కపల్లి : ఆయన పేరు ఎస్.వి.ఎస్ ఆచార్యులు. పెదబోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పాఠశాలల పనివేళల్లో విద్యాబోధనతో పాటు, తీరిక వేళల్లోను, సెలవు దినాల్లోను ఏదో ఒక సామాజిక సేవా కార్యాక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. తీరిక సమయాల్లో విద్యార్థులతో పాటు, గ్రామాల్లో సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తుంటారు. సొంత లాభం కొంత మానుకుని పొరుగు వారికి తోడ్పడవోయ్ అంటూ ఆచార్యులు మాస్టారు చేసే సేవా కార్యక్రమాలకు విద్యార్థులతోపాటు, వారి తల్లిదండ్రులు కూడా ప్రశంసలందిస్తున్నారు. నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేసే ఆచార్యులు ఇటీవల పెద బోదిగల్లం పాఠశాలకు బదిలీ అయ్యారు. నక్కపల్లిలో పని చేసిన సమయంలో పదో తరగతి వెనుకబడిన విద్యార్థులకు సాయంత్రం పూట ప్రత్యేక తరగతులు నిర్వహించేవారు. రాత్రిపూట ఇళ్లకు వెళ్లి విద్యార్థులు ఎలా చదువుతున్నారో పరిశీలించేవారు. విద్యార్థుల తల్లిదండ్రులతో గ్రామాల్లో ఉన్న రామాలయాలు, సామాజిక భవనాల వద్ద సమావేశాలు నిర్వహించి వారిలోచైతన్యం తీసుకు వచ్చేవారు. విద్యార్థుల సందేహాలు తీరుస్తూ ఉత్తమఫలితాలు సాధించేలా ప్రత్యేక కృషి చేసే వారు.అలాగే పాఠశాలల పునః ప్రారంభానికి ముందు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, అందిస్తున్న ఆర్థిక సాయం గురించి వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లల్ని చేర్పించాలంటూ ఫ్లెక్సీలు, బ్యానర్లు ద్వారా విస్తృత ప్రచారం చేసేవారు. నక్కపల్లి పరిసర ప్రాంత గ్రామాల్లో తనకు ఉన్న పరిచయాల ద్వారా ఎక్కువ మందిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేలా తన వంతు కృషి చేసేవారు. అలాగే పూర్వ విద్యార్థుల సమావేశాలు నిర్వహించడం, వారి ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం విరాళాలు ఇచ్చేలా చైతన్యం తీసుకు రావడం వంటి కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆచార్యులు మాస్టారు చేస్తున్న సేవలను గుర్తించి గత ఏడాది ఉపాధ్యాయ దినోత్సవం నాడు ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఇచ్చి గౌరవంగా సత్కరించింది. నక్కపల్లి నుంచి బదిలీ అయిన తర్వాత కూడా ఆయన తన సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించడం విశేషం.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు

సెలవు దినమైన ఆదివారం నాడు ఆచార్యులు మాస్టారు సమీపంలో ఉన్న పెద బోదిగల్లం, సీతంపాలెం, పెదదొడ్డిగల్లు, తదితర గ్రామాల్లో బాల్య వివాహాలపై అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దల సాయంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు. బాల్యవివాహాలను ప్రోత్సహించేవారిని, చేసేవారిని కఠినంగా శిక్షించే చట్టాలను గురించి వివరించారు. చిన్నతనంలో వివాహాలు చేయడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలను సైతం తెలియజేశారు. ఆడ పిల్లలను చదివించడం మనందరి సామాజిక బాధ్యత అని, వారిని చదివించి ఉజ్వల భవిష్యత్ అందించవచ్చని వివరించారు. ఆడపిల్లలను బడికి పంపకుండా పెళ్లిళ్లు చేసి పంపిస్తే ఆరోగ్య సమస్యలు వస్తాయని వారికి పుట్టే పిల్లలపై కూడా ప్రభావం చూపుతుందని వివరించారు. ఆడపిల్లలు చదువుకుని చైతన్యవంతులు కావడమే కాకుండా సమాజ హితం కోసం పనిచేయాలని సూచించారు. విద్యార్థిని, విద్యార్థులతో కలసి గ్రామంలో ఆచార్యులు చేసిన ఈ కార్యక్రమాన్ని పలువురు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగ అప్పలరాజు పాల్గొన్నారు.

మంచినీటి పథకాల్లో క్లోరినేషన్



రక్షిత మంచినీటి ట్యాంకును శుభ్రం చేస్తున్న ఉద్యోగి

కోటవురట్ల : కె.వెంకటాపురంలోని రక్షిత మంచినీటి పథకంలో ఆదివారం క్లోరినేషన్ చేశారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పైల రమేష్ గ్రామంలోని రెండు వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు అతిసార ప్రబలకుండా సర్పంచ్ చర్యలు చేపట్టినట్టు తెలిపారు. గ్రామంలోని 40 వేలు, 20 వేలు లీటర్ల మంచినీటి సామర్థ్యం కలిగిన రెండు రక్షిత మంచినీటి పథకం ట్యాంకుల లోపల బ్లీచింగ్‌తో శుభ్రం చేయించి వాటర్‌ను క్లోరినేషన్ చేయించినట్టు తెలిపారు.